క్లుప్తంగా

చేగువేరా ఆదర్శప్రాయుడు



చేగువేరా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కంచిలి: విప్లవ యోధుడు చేగువేరా యువతకు ఆదర్శప్రాయుడని వక్తలు పేర్కొన్నారు. శాసనాంలో చేగువేరా 96వ జయంతి వేడుకలను మండల కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించారు. మండల కన్వీనర్ అయినింటి లోకనాథం చేగువేరా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఈశ్వర్, చింటూ, వేణు, హేమరాజు, దీనబంధు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి సాయం



నగదు, సరుకులు అందజేస్తున్న అభయం సేవా సంఘం ప్రతినిధులు

టెక్కలి: సారవకోట మండలం సార్లిగాం గ్రామంలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో ఇల్లు కోల్పోయి నిరాశ్రయురాలైన మెట్ట కస్తూరి అనే బాధితురాలికి టెక్కలికి చెందిన అభయం యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో కాపల నారాయణరావు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో సేవా సంఘం ప్రతినిధులు డి.శ్రీనివాసరావు, ఎన్.సింహాచలం, డి.పూర్ణాచారి, మున్నా, వీరభద్రం, యు.గోవింద్, డి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి

కవిటి: రానున్న వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్న నేపథ్యంలో గ్రామాల్లో పారిశుద్ధ్య పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ కె.శ్రీనివాసరెడ్డి అన్నారు. శుక్రవారం కవిటి మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవితాపం అధికంగా ఉన్నందున తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలన్నారు. అనంతరం సర్టిఫికెట్ల జారీకి సంబంధించి స్టేషనరీ సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో వివిధ సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

యర్రవాని చెరువు అభివృద్ధికి రోటరీ సహకారం



చెరువు గట్టుపై ఏర్పాటు చేస్తున్న బెంచీలు

సోంపేట: మండలంలోని జింకిభద్రలో యర్రవాని చెరువు అభివృద్ధికి రోటరీక్లబ్ అధ్యక్షుడు దుద్ది శ్రీనివాసరావు తనవంతు సాయం అందించారు. గ్రామానికి చెందిన వివేకనంద యువజన సంఘ సభ్యుల చొరవతో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రన్నింగ్ ట్రాక్, బెంచీలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ తామాడ పద్మావతి, గ్రామస్తులు అభినందనలు తెలియజేశారు.

హిందూమత సమ్మేళనం విజయవంతం చేయండి



పోస్టర్ ఆవిష్కరణలో అలేఖ్ స్వాములు

కాశీబుగ్గ: ద్వేషం, అసమానతలకు వ్యతిరేకంగా ఈ నెల 19న హైదరాబాద్‌లో జరగనున్న హిందూమతం సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని అలేఖ్ స్వామి సాధు వల్లభానంద స్వామి, నిజానంద స్వాములు, అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి, హెచ్‌పీఈ జాతీయ కార్యదర్శి యోధదాస్, జైభారత్ అధికార ప్రతినిధి యోధ మల్లికావల్లభ, తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు సత్యనారాయణ కోరారు. ఈ మేరకు మందసలో శుక్రవారం పోస్టర్ ఆవిష్కరించారు.

చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

టెక్కలి: చిన్నారులు మానసిక, శారీరక ఎదుగుదల కోసం తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సంధ్య పిలుపునిచ్చారు. శుక్రవారం సెక్టార్–2 పరిధిలో ఆదిఆంధ్రావీధిలో మన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. సెక్టార్ పరిధిలో గల చిన్నారులు, తల్లులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

రక్తదాతలే ప్రాణదాతలు



కాశీబుగ్గ: ఆ నలుగురు ట్రస్ట్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



కవిటి: జాడుపుడి ఆర్‌ఎస్‌లో రక్తదానం చేస్తున్న దాతలు



కాశీబుగ్గ: కిడ్నీపరిశోధన కేంద్రంలో రక్తదాన శిబిరం ప్రారంభిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మ



ఇచ్ఛాపురం: సీహెచ్‌సీలో మెగా రక్తదాన శిబిరం



కవిటి: కవిటిలో రక్తదానం చేస్తున్న దాతలు

కాశీబుగ్గ: రక్తదానం చేస్తే మరో ముగ్గురికి ప్రాణదానం చేసినట్లేనని పలాసలోని వైఎస్సార్ కిడ్నీ రీసెర్చ్‌సెంటర్, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అల్లు పద్మజ అన్నారు. శుక్రవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా పలాసలో ఆ నలుగురు ట్రస్టెట్ ఆధ్వర్యంలో విద్యవాహిని కళాశాల విద్యార్థుల ఆధ్వర్యంలో రక్తదాన అవగాహన ర్యాలీ, మానవహారం నిర్వహించచారు. అనంతరం కిడ్నీ పరిశోధన కేంద్రంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. 35 మంది వైద్యులు, సిబ్బంది స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా సూపరింటెండెంట్ మాట్లాడుతూ ఆరేళ్లగా రక్తదాతలను అందిస్తున్న ఆ నలుగురు ట్రస్ట్ ప్రతినిధులు చొరవ అభినందనీయమన్నారు. యువత రక్తదానం చేసేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో సీఎస్ఎంఓ డాక్టర్ కూన మోహన్‌బాబు, డాక్టర్ అమర్నాథ్ దేవరశెట్టి, ఆ నలుగురు ట్రస్ట్ వ్యవస్థాపకులు పిచ్చుక పాపారావు, కమిటీ సభ్యులు సానా ఈశ్వరరావు, టెంక తేజేశ్వరరావు, రాజు, మన్మథ, నరేష్, హేమసుందర్, ఉదయ్‌దిలీప్, సాయి, సంతోష్, యువత ప్రాణదాత బ్లడ్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: రక్తదానం చేయడం వల్ల ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తి ప్రాణాలు కాపాడే గొప్ప అవకాశం లభిస్తుందని సీహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి.దేవేంద్రరెడ్డి అన్నారు. ఇచ్ఛాపురం పట్టణంలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రి వద్ద జేసీఐ, చైల్డ్ ఫండ్ ఇండియా లింక్‌వర్కర్ సంయుక్తంగా ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. మెగా రక్తదాన శిబిరాన్ని ఏర్పాటుచేయగా 82 మంది యువకులు రక్తదానం చేశారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో రిమ్స్ ఆసుపత్రి వైద్యులు డాక్టర్ నితిన్, వైద్యులు రాజేష్, ఐసీటీసీ కౌన్సిలర్ బి.రాజశేఖర్, జిల్లా రిసోర్స్‌పర్సన్ హెచ్.నాగభూషణరావు, పి.సుధాకర్, జి.రవి, గెస్ట్ సీఎం నిరంజన్, జేసీఐ అధ్యక్ష, కార్యదర్శులు షణ్ముఖరావు, పవన్, జేసీఐ ప్రతినిధులు ఢిల్లేశ్వరరావు, వి.రాము, గౌరీశంకర్, రాజ్‌కుమార్, మధుబాబు తదితరులు పాల్గొన్నారు.

కవిటి: ఆపద సమయాల్లో రక్తం అందక చనిపోతున్న వందలాది మంది అభాగ్యుల జీవితాలకు ప్రాణం పోసే రక్తదానం పట్ల యువతలో కనిపిస్తున్న సామాజిక స్పృహ, చైతన్యం మంచి పరిణామమని సోంపేట సీహెచ్‌సీ రిటైర్డ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఇ.లక్ష్మీనారాయణ అన్నారు. శుక్రవారం జాతీయ రక్తదాతల దినోత్సవం సందర్భంగా కవిటి, జాడుపుడి ఆర్ఎస్ గ్రామాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహించారు. జాడుపుడి ఆర్ఎస్‌లో ఎస్‌జీఎఫ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో శిబిరం నిర్వహించగా 30 యూనిట్ల రక్తాన్ని యువత వితరణ చేశారు. కవిటిలో తిరుపూర్ గార్మెంట్స్ అధినేత కె.ఉమాశంకర్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించగా 52 యూనిట్ల రక్తం వితరణగా అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాండవ చంద్రశేఖర్, కోడా దేవరాజు, లండ ధర్మరాజు, నల్లాన విశ్వేష్ తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

టెక్కలి: సమాచార హక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని చట్టం రక్షణ వేదిక ప్రతినిధులు ఎ.షణ్ముఖరావు, యు.సూర్యనారాయణ కోరారు. ఈ మేరకు శుక్రవారం తొలుసూరుపల్లి రోడ్డులోని కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. రాష్ట్ర విభజన అనంతరం స.హ. చట్టం సక్రమంగా అమలు కాలేదన్నారు. అవినీతి అక్రమాలు చేసే అధికారులకు తగిన గుణపాఠం చెప్పేలా సామాన్యుడి చేతిలో వజ్రాయుధంగా ఉన్న సమాచార హక్కు చట్టాన్ని పక్కాగా అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎస్.తవుడు, సీహెచ్.రాము తదితరులు పాల్గొన్నారు.

29న జాతీయ లోక్ అదాలత్



మాట్లాడుతున్న ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు

టెక్కలి: ఈ నెల 29న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అత్యధికంగా కేసులు రాజీ జరిగేలా కక్షిదారులకు అవగాహన కల్పించాలని టెక్కలి ఇన్‌చార్జి సీనియర్ సివిల్ జడ్జి జె.శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం కోర్టు ఆవరణలో న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న పలు కేసుల నుంచి కక్షిదారులకు విముక్తి కలిగేలా రాజీకి ప్రయత్నించాలన్నారు. సమావేశంలో జూనియర్ సివిల్ జడ్జి ఎస్‌హెచ్‌ఆర్ తేజ చక్రవర్తి మల్ల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డి.వివేకానంద, ఏపీపీ పి.వైకుంఠరావు తదితరులు పాల్గొన్నారు.

టెక్కలిలో ఈదురుగాలుల బీభత్సం



టెక్కలి పాత జాతీయ రహదారిలో నేలకొరిగిన చెట్టు

టెక్కలి/టెక్కలి రూరల్: టెక్కలిలో శుక్రవారం మధ్యాహ్నం ఈదురుగాలులు, వర్షాలు బీభత్సం సృష్టించాయి. మండలం పరిధిలో సుమారు 25 విద్యుత్ స్తంభాలు నేలకొరగడంతో సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ప్రధాన రహదారుల్లో చెట్లు నేలకొరగడంతో పాటు ఇళ్లపై చెట్లు కూలిపోవడంతో ఆయా ఇళ్లు దెబ్బతిన్నాయి. విద్యుత్ శాఖ సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనుల్లో నిమగ్నమయ్యారు. తెంబూర్ రోడ్డులోని గ్యాస్ కంపెని ముందు ఖాళీ గ్యాస్ సిలిండర్లతో ఉన్న ఆటో గాలుల ధాటికి రైల్వే కాలువలోకి దూసుకెళ్లిపోయింది.



రైల్వే కాలువలోకి దూసుకెళ్లిన ట్రాలీ ఆటో




బర్మాకాలనీలో దెబ్బతిన్న ఇంటి పైకప్పు

పాఠశాలలకు కిట్లు, పుస్తకాల సరఫరా



వజ్రపుకొత్తూరు: పాఠ్యపుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈఓలు

వజ్రపుకొత్తూరు: మండలంలో ప్రభుత్వ పాఠశాలలకు 39,491 పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్లు ఎంఈఓ–1 డి.సాశరధి, ఎంఈఓ–2 బి. వెంకటరమణ తెలిపారు. వీటితో పాటు నోట్ పుస్తకాలు, 37,542, బ్యాగ్‌లు 6672, షూలు వచ్చినట్లు వివరించారు.



కోటబొమ్మాళి: హైస్కూల్‌కు పుస్తకాలను అందజేస్తున్న ఎంఈఓలు

కోటబొమ్మాళి: మండలంలో 106 ప్రభుత్వ పాఠశాలలకు పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలతో పాటు స్టూడెంట్ కిట్లు పంపిణీ చేసినట్లు ఎంఈఓలు ఎస్.అప్పలరాజు, ఎల్.విశ్వప్రతాప్ తెలిపారు. యూనిఫాం ఇంకా రాలేదని, వచ్చిన వెంటనే పంపిణీ చేస్తామని చెప్పారు.

ఆలయ అభివృద్ధికి రూ.50 వేలు విరాళం

కంచిలి: మండల కేంద్రం కంచిలికి చెందిన బలివాడ చంద్రశేఖరం, విమల దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడు, కుమార్తె, అల్లుడు శుక్రవారం వెంకటేశ్వరస్వామి ఆలయం అభివృద్ధికి రూ.50,116 విరాళం అందజేశారు. ఈ మొత్తాన్ని ఆలయ బ్యాంకు అకౌంట్‌కు క్రెడిట్ చేశారు. విరాళం ఇచ్చిన వారిలో కుమారుడు బలివాడ కామేశ్వరరావు, కుమార్తె పోలిమహంతి సునీత, అల్లుడు శ్రీనివాస్ దంపతులు ఉన్నారు.

రోడ్డు ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం



కేశవరావుకు సాయం అందిస్తున్న ప్రతినిధులు

ఇచ్ఛాపురం: మున్సిపాలిటీ పరిధిలోని పురుషోత్తపురం గ్రామానికి చెందిన గాలి కేశవరావుకు ఎంప్లాయిస్ డ్రీ ఫౌండేషన్, పురుషోత్తపురం(ఈడీఎఫ్) ప్రతినిధులు ఆర్థిక సహాయం చేసి ఆదుకున్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో రెండుకాళ్లు పోగొట్టుకొని దివ్యాంగునిగా మిగిలిన కేశవరావుకు శుక్రవారం రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు సురేష్, ప్రతాప్, దర్మారావు, చిన్నా తదితరులు పాల్గొన్నారు.

వేతనదారులకు గరిష్ట వేతనమే లక్ష్యం



బెజ్జిపుట్టుగలో మస్టర్ తనిఖీచేస్తున్న ఏపీడీ శ్రీనివాసరెడ్డి

కవిటి: ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న వేతనదారులు నిబంధనల మేరకు కొలతల్లో పూర్తిస్థాయిలో పనిచేయడం ద్వారా వేతనాల్లో గరిష్ఠ ప్రయోజనం లభిస్తుందని ఏపీడీ సీహెచ్ శ్రీనివాసరెడ్డి అన్నారు. బెజ్జిపుట్టుగ పంచాయతీలో జరుగుతున్న ఉపాధి పనులను శుక్రవారం పరిశీలించారు. మండలంలో 1800 మంది మాత్రమే పనిచేయడం, గత వారం కన్నా తక్కువగా వేతనదారులు మోదుకావడం పట్ల ఆయన ఆరా తీశారు. కార్యక్రమంలో ఏపీఓ టి.మోహనరావు, టీఏ బల్లెడ శ్యామసుందరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్‌పై అప్రమత్తత అవసరం



అవగాహన కల్పిస్తున్న జేడీ నరసింగరావు

టెక్కలి: క్యాన్సర్ వ్యాధి రాకుండా అప్రమత్తంగా ఉండాలని జేడీ డాక్టర్ నరసింగరావు సూచించారు. ఎన్సీడీ ప్రోగ్రాం అధికారి శ్రీదేవి ఆధ్వర్యంలో టెక్కలి జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో శుక్రవారం క్యాన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ అనారోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్ సోకే అవకాశముందన్నారు. వ్యాధిపై ఎటువంటి అనుమానం కలిగినా తక్షణమే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వైద్య అధికారులు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాల పంపిణీ

ఇచ్ఛాపురం రూరల్: రైతులకు ప్రభుత్వం ఎల్లవేళలా అండగా ఉంటుందని టీడీపీ నాయకుడు బోర ప్రసాద్, జనసేన రాష్ట్ర కార్యదర్శి తిప్పన దుర్యోధనరెడ్డి అన్నారు. శుక్రవారం ఈదుపురం, కేదారిపురం రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు ఖరీఫ్ విత్తనాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో బోర యువరాజు, అంబటి ఈశ్వరరావు, రాజారావు, శంకర్, పంచాయతీ కార్యదర్శి నీలాపు శ్రీనివాసరావు, గ్రామ వ్యవసాయ సహాయకురాలు పాతిర్ల నిర్మలరెడ్డి పాల్గొన్నారు.

16న దివ్యాంగ చిన్నారుల పునరావాస కేంద్రం ప్రారంభం



కలెక్టర్‌ను ఆహ్వానిస్తున్న గుళ్ల రమేష్

కంచిలి: మండలంలోని మండపల్లి గ్రామంలో సీతయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమం 5వ వార్షికోత్సవం సందర్భంగా ఈ నెల 16న అవయవదాత మల్లారెడ్డి కిరణ్‌చంద్ జ్ఞాపకార్థం దాతల సహాయంతో నూతనంగా నిర్మించిన దివ్యాంగులు, మానసిక వికలాంగులకు ప్రత్యేక పాఠశాల, పునరావాస కేంద్రం ప్రారంభోత్సవాన్ని చేపట్టనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు గుళ్ల రమేష్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అదే రోజున ప్రాంగణంలో నిర్మించిన ఆతిథ్య నిలయాన్ని, దివ్యాంగుల సేవార్థం ఏర్పాటు చేసిన నూతన వాహనాన్ని, ఆశ్రమవాసుల దాహార్తిని తీర్చే తాగునీటి వసతిని ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాలకు జిల్లా కలెక్టర్ డాక్టర్ మనజీర్ జీలాని సమూన్, డీఆర్వో, పలాస ఆర్డీఓలను ఆహ్వానించినట్లు రమేష్ తెలిపారు.

ఎమ్మెల్యేను కలిసిన అదనపు ఎస్పీ



ఎమ్మెల్యే శిరీషకు మొక్క అందిస్తున్న ఏఎస్పీ ప్రేమ్‌కాజల్

కాశీబుగ్గ: పలాస నూతన ఎమ్మెల్యే గౌతు శిరీషను జిల్లా అదనపు ఎస్పీ ప్రేమ్ కాజల్ శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. పలాస మండలం శాసనాం గ్రామంలోని శిరీష స్వగృహంలో కలిసి అభినందనలు తెలిపారు.

వజ్రపుకొత్తూరు: వజ్రపుకొత్తూరు తహసీల్దార్ సురేష్ ఆధ్వర్యంలో మండల రెవిన్యూ ఉద్యోగులు శుక్రవారం పలాస ఎమ్మెల్యే గౌతు శిరీషను ఆమె నివాసంలో మర్యాపూర్వకంగా కలిశారు. ఉప తహసీల్దార్ వి.గిరిరాజు, ఆర్ఐ డి.పవిత్ర, వీఆర్ఓలు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అశోక్‌కు అభినందనలు



ఎమ్మెల్యేను సత్కరిస్తున్న సర్పంచ్, ఈఓ

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గానికి మూడుసార్లు వరుసగా ఎమ్మెల్యేగా గెలుపొందిన డాక్టర్ బెందాళం అశోక్‌కు కవిటి మేజర్ పంచాయతీ సర్పంచ్ పూడి లక్ష్మణరావు, కవిటి పంచాయతీ ఈఓ జి.వీరభద్రస్వామి సిబ్బందితో కలిసి శుక్రవారం మర్యాదపూర్వకంగా రామయ్యపుట్టుగలోని ఆయన నివాసంలో కలిశారు. దుశ్శాలువతో సత్కరించి పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు.

జీడి పిక్కలను ప్రభుత్వమే కొనాలి



మామిడిపల్లిలో కరపత్రాలను అందజేస్తున్న రైతాంగ కమిటీ ప్రతినిధులు

పలాస: ఉద్దానం ప్రాంతంలో రైతులు పండించిన జీడి పంట, జీడి పిక్కలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని రైతాంగ సమస్యల సాధన కమిటీ ప్రతినిధులు డిమాండ్ చేశారు. పలాస మండలం ఉద్దానం ప్రాంతంలోని రంగోయి, నీలావతి, గురుదాసుపురం, మాకన్నపల్లి, బొడ్డపాడు, మామిడిపల్లి తదితర గ్రామాల్లో పర్యటించి రైతులకు కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా కమిటీ నాయకులు మామిడి మాధవరావు, గొర్లె చలపతిరావు మాట్లాడుతూ ఉద్దానం జీడి పిక్కలను బస్తా కు రూ.16వేలు చెల్లించాలని, వంశధార నదీ జలాలను ఉద్దానం గ్రామాలకు అందజేయాలని, తితిలీ తుపాను నష్టపరిహారం అందని 7 వేలు మంది రైతులకు న్యాయం చేయాలని, రుణాలను మాఫీచేయాలని, కొత్త రుణాలను బ్యాంకుల ద్వారా అందజేయాలని, కిడ్నీ వ్యాధికారణాలను తెలుసుకునేలా తగిన పరిశోధన చేయాలని కోరారు. కార్యక్రమంలో దాసరి శ్రీరాములు, బి.సింహాద్రి, పుచ్చ దుర్యోధన, తామాడ త్రిలోచనరావు, టి.రామారావు, వి.వీరాస్వామి, నల్ల హడ్డి మాస్టారు, జి.లోకనాథం, ఎం.ధర్మారావు, గర్తం కూర్మారావు, గంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పలాస నియోజకవర్గ అభివృద్ధికి కృషి



వ్యాపారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

కాశీబుగ్గ: పలాస నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తానని నూతన ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. శుక్రవారం పలాసలోని తన నివాసంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పార్టీ అధినేత చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం హామీలు నెరవేర్చే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, ఇందులో భాగంగా ఐదు సంతకాలు చేశారని చెప్పారు. ప్రజాధనం దుర్వినియోగం కాకుండా విధానపరమైన పాలన అందజేస్తామని పేర్కొన్నారు. అవినీతి రహిత సమాజం స్థాపించడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, పార్లమెంటరీ ప్రధాన కార్యదర్శి విఠల్, లొడగల కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.